


వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 47 | శుక్రవారం | 11 ఆగస్టు 2023 | పేజీలు : 06 | వెల రూ. 5

# పద్మశాలీల యుద్ధభేరి





2లో..

- విజయవంతానికి నేతన్నల శంఖారావం
- 13న జగిత్యాల జిల్లా కోరుట్లలో ఏర్పాట్లు
- రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడమే లక్ష్యం
- కనీ వినీ ఎరుగని రీతిలో కదులుతున్న కులస్తులు
- పార్టీలకతీతంగా పాల్గొనేందుకు సిద్ధం

భరిస్తున్నాం కదా అని ఇంకా బంధిస్తామంటే ఎదురు తిరిగే క్షణాలు తప్పక ఎదుర్కోవాల్సిందే.. తలాడిస్తున్నారు కదా అని నెత్తినెక్కితే తాట తీసిన సందర్భాలు కళ్లారా చూడాల్సిందే.. ఎదుటి వారు ఓపిగ్గా ఉన్నంత వరకే ఏదైనా సాధ్యం తప్ప, అణచివేతను కడిగి పారేసే రోజొస్తే ఆపడం ఎవరి తరం కాదనే చరిత్ర సత్యాన్ని ఇప్పుడు తెలంగాణ పద్మశాలీ కులస్తులు మరోమారు లిఖించబోతున్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై తిరగబడడానికి సిద్ధమవుతున్నారు. తామేంటో.. తమ బలమేంటో.. కులానికి జరుగుతున్న అన్యాయమేంటనే విషయాలపై రాజకీయ పార్టీలను నిలదీయడానికి కులస్తులంతా ఒక్కటై జగిత్యాల జిల్లా కోరుట్ల వేదికగా గాండ్రించడానికి ముహూర్తం నిర్ణయించారు. పబ్బం గడుపుకునే పార్టీల తీరును కడిగేయడమే లక్ష్యంగా ఈ నెల 13న పద్మశాలి రాజకీయ యుద్ధ భేరీకి వేదికను సిద్ధం చేసుకున్నారు. పార్టీలు తమను గుర్తిస్తాయా.. లేదంటే తదుపరి కార్యాచరణ ఏంటనే విషయాలపై తేల్చుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీలంతా జగిత్యాల జిల్లా బాటపట్టనున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి



2లో

సిబ్బంది సంక్షేమంపై

## ప్రత్యేక దృష్టి

వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్

## సేవలో మేటి ఎర్రబెల్లి ట్రస్టు

రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు

స్నేహితుల సహకారంతోనే ప్రజాసేవ

డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ



2లో..

## రాజకీయ రిటైర్‌మెంట్ తీసుకుంటా..!

మిగులు అభివృద్ధి చేసిపోతా..

చివరి ఛాన్స్ ఇవ్వండి...

డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్

6లో





# పద్మశాలీల.. యుద్ధ భేరి

**విజయవంతానికి నేతన్నల శంఖారావం**

**13న జగిత్యాల జిల్లా కోరుట్లలో ఏర్పాట్లు**

**రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడమే లక్ష్యం**

**కనీ వినీ ఎరుగని రీతిలో కదులుతున్న కులస్తులు**

**పార్టీలకతీతంగా పాల్గొనేందుకు సిద్ధం**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడమే లక్ష్యంగా పద్మశాలీలంతా ఏకమవుతున్నారు. తమ బలం ప్రదర్శించి, గర్జన వినిపించడానికి సిద్ధమయ్యారు. సంఖ్యాపరంగా ఇతర కులాలకంటే ఎక్కవ సంఖ్యలో ఉన్నప్పటికీ అన్ని రంగాల్లో వివక్షకు గురికావడంపై మండిపడుతున్నారు. ఎంతో ఘన చరిత్ర, ఎన్నో కార్యక్రమాలు, మరెన్నో ఉద్యమాల్లో శక్తివంచన లేకుండా భాగస్వామ్యమైన తమకు జరుగుతున్న అన్యాయంపై తిరగబడడానికి సిద్ధమవుతున్నారు. పార్టీ ఏదైనా వారి అవసరాలకు వాడుకుని వదిలేసే తీరుపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తమకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించేందుకు దండుగా కదులుతున్నారు. పద్మశాలీ మేధావులు, జర్నలిస్టులు, కుల పెద్దలు, ఉన్నతోద్యోగులు, విద్యావేత్తలు, స్వచ్ఛంద సేవకులు, కార్మిక సంఘాలు, యువజన నాయకులంతా ఒక్కటై తమను అవసరాలకు వాడుకుంటున్న పార్టీలను కడిగి పారేసేందుకు అస్త్రశస్త్రాలు రెడీ చేసుకుంటున్నారు. జనాభా దామాషా ప్రకారం రాష్ట్రంలో 18 శాసనసభ స్థానాలు పద్మశాలీలకు దక్కాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు పడడం లేదు. దీంతో రాజకీయ పార్టీల తీరును ఎండగట్టేందుకు ఈ నెల 13న జగిత్యాల జిల్లా కోరుట్లను వేదికగా ఖరారు చేసుకుని పద్మశాలి శంఖారావాన్ని వినిపించనున్నారు.

### చేనేత దేశ వారసత్వ సంపద..

చేనేత అనేది దేశ వారసత్వ సంపద. దానిని కాపాడుకోవడానికి ఏ ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపడంలేదు. బడ్జెట్ లో తగినన్ని నిధులు కేటాయించకపోగా కోత విధిస్తున్నారు. అదేమని ఆడగడానికి చట్ట సభలలో చేనేత వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు కరువయ్యారు. దాంతో వారి సమస్యలను చట్టసభల్లో వినిపించడానికి అవకాశం లేకుండా పోయింది. అటు పార్లమెంట్ లోగానీ, ఇటు శాసనసభలో గానీ చేనేత వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లేని పరిస్థితి నెలకొంది. చట్ట సభలలో చేనేత గళం విప్పడానికి ఈ వర్గానికి రాజకీయ వారసత్వం కరువైంది.

### ఓటు బ్యాంకు రాజకీయాలు..

చేనేతకు ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహంలేకపోవడంతో చేనేత పరిశ్రమ కుంటుపడిపోయింది. దాంతో మరో పని చేయడం తెలియని చేనేత కార్మికులు అప్పులపాలై, అధిక వడ్డీలు చెల్లించలేక, ఆత్మగౌరవం చంపుకోలేక ఆత్మహత్యలు చేసుకోవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వారికి ఉపాధికి భద్రతలేదు. సమస్త మానవాళికి దుస్తులు అందించిన పద్మశాలీలు నేడు ఉపాధి కరువై పస్తులతో కాలం గడుపుతున్నారు. ఇతర కులాలతో పోల్చితే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పద్మశాలీల సంఖ్య చెప్పుకొదగిన స్థాయిలో ఉన్నప్పటికీ వారికి రాజకీయ అండదండలు లేక అట్టడుగు స్థానానికి దిగజారి పోతున్నారు.

### ఏకమవుతున్న కులస్తులు..

రాజకీయ భాగస్వామ్యం కోసం పద్మశాలీలంతా ఏకమవుతున్నారు. పలుగు, పార పట్టుకొని యుద్ధానికి సిద్ధమైనట్లు జగిత్యాల జిల్లా కోరుట్లలో ఈ నెల 13న నిర్వహించనున్న పద్మశాలీ గర్జనకు లక్షలాదిగా తరలి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తిగా పద్మశాలీలు సాంఘిక, ఆర్థిక, రాజకీయాలపై దృష్టి సారిస్తున్నారు. చేనేత గళం వినిపించాలంటే చట్ట సభలలో స్థానం సంపాదించాలి. అందరూ కలసి బలప్రదర్శన చేస్తేనే రాజకీయ పార్టీల్లో ఒనుకు ప్రారంభమవుతుందని భావించిన పద్మశాలీలు తమ సత్తా చాటేందుకు సిద్ధపడుతున్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా పద్మశాలీలంతా సంఘటితంగా కథన రంగానికి దూకుతున్నారు. ఇంత కాలం గంజి కేడ్చాం..గుడ్డ కేడ్చాం..అన్న సినిమా డైలాగును గుర్తు చేసుకుంటూ తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. పద్మశాలీలకు కనీసం 15 శాసన సభ స్థానాల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కాదంటే చావో..రేవో తేల్చుకునేందుకు సిద్ధపడుతున్నారు.


### ఇంటి పండుగలా..: రామా శ్రీనివాస్



తెలంగాణ స్టేట్ పద్మశాలి సంఘం కన్వీనర్ రామా శ్రీనివాస్ సమన్వయంతో ఆగస్టు 13వ తేదీని పద్మశాలీ కులస్తులంతా ఇంటి పండుగలా భావిస్తున్నారు. పండుగ రోజు పొద్దునే లేచి ఇంటి కార్యక్రమాలను ఎలా చక్కబెట్టుకుంటారో అదే విధంగా ఆదివారం వడివడిగా ఇంటి పనులు పూర్తి చేసుకొని కుటుంబ సమేతంగా కోరుట్లకు తరలించేందుకు ఆయన ప్రణాళికలు సిద్ధం చేశారు. బంధు, మిత్రుల సమేతంగా పద్మశాలి గర్జనకు హాజరై తమ సత్తా చాటడమే లక్ష్యంగా రామా శ్రీనివాస్ పావులు కదుపుతున్నారు. ఇందుకు గాను గత పది రోజులుగా గ్రౌండ్ లెవల్ లో పద్మశాలీలను ఒక్క తాటిపైకి తీసుకొచ్చేందుకు ఆయన విశేష కృషి చేశారు. కోరుట్ల సభకు భారీ సంఖ్యలో తరలివచ్చే పద్మశాలీలకు కావాల్సిన రవాణా సౌకర్యాలతోపాటు కావాల్సిన భోజన సదుపాయాలను కూడా రామా శ్రీనివాస్ దగ్గరుండి చూసుకుంటున్నారు.

### యుద్ధభేరీని జయప్రదం చేయాలి

**బాల్నె శరత్ బాబు**



పద్మశాలీలలో రాజకీయ చైతన్యం అవసరమని, రాజకీయంగా మరింతగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా కన్వీనర్ బాల్నె శరత్ బాబు అన్నారు. ఛలో కోరుట్ల పద్మశాలీ రాజకీయ యుద్ధభేరీ దీనికి నాంది పలకాలని ఆశించారు. ఈ సభకు పద్మశాలీలు భారీగా తరలిరావాలని, ఇంటికో వ్యక్తి తరలివచ్చి సభను విజయవంత చేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో పద్మశాలీలు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రధాన పార్టీలన్నీ అధిక సంఖ్యలో పద్మశాలీలకు అసెంబ్లీ, ఎంపీ టెకెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

### వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిబద్ధతతో పని చేసే సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బార్బర్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వారంతపు సెలవు మంజూరు చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించే పోలీస్ సెలూన్ విభాగంలో నిరంతరం విధులు నిర్వహించే సిబ్బంది తమ వ్యక్తిగత పనులు నిర్వర్తించుకోవడంతో వారి కుటుంబ సభ్యులతో కొద్ది సమయాన్ని కేటాయించేందుకుగాను పోలీస్ సెలూన్ లో విధులు నిర్వహించే సిబ్బందికి ప్రతి మంగళవారం రోజున వారంతపు సెలవుగా పోలీస్ కమిషనర్ ప్రకటించారు. తమ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గతంలో ఎన్నడూ లేని విధంగా తమకు వారంతపు సెలవు మంజూరు చేసినందుకు గాను పోలీస్ సెలూన్ సిబ్బంది వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. సెలూన్ నిర్వహణలో ఎలాంటి సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని పోలీస్ కమిషనర్ సెలూన్ సిబ్బందికి సూచించారు. పోలీస్ కమిషనర్ ను కలిసిన వారిలో జె.శ్రీరాములు, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, మోహన్, సమ్మయ్య, యుగేందర్ పాల్గొన్నారు.

## సేవలో మేటి ఎర్రబెల్లి ట్రస్టు

**రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు**

**స్నేహితుల సహకారంతోనే ప్రజాసేవ**

**డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ**



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాజకీయాలకు అతీతంగా తాను సేవ చేస్తున్నట్లు, తన వద్ద డబ్బులు లేనప్పటికీ, పలువురు స్నేహితుల సహకారంతో వినూత్నంగా, విశేషంగా సేవా కార్యక్రమాలు తమ ఎర్రబెల్లి ట్రస్ట్ తరఫున నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గం లో యువతకు ఉచితంగా ఎర్రబెల్లి ట్రస్ట్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సుల జారీ కార్యక్రమం నిర్వహిస్తుండగా, శుక్రవారం మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్ లోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో తొర్రూరు పట్టణానికి చెందిన 150మందికి ఉచిత లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, ఉషా దయాకర్ రావు నేతృత్వంలో నిర్వహిస్తున్న ఎర్రబెల్లి ట్రస్ట్ వైద్య ఆరోగ్య శిబిరాలతో పాటు కరోనా కష్టకాలంలో నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, ఉచిత శిక్షణ ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ, ఉపాధి హామీ కూలీలకు లంచ్ బాక్సుల పంపిణీ, నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి, ఉద్యోగ శిక్షణ, తాజాగా యువతకు డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ వంటి పలు కార్యక్రమాలను దిగ్విజయంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలకు తమ వద్ద డబ్బు లేనప్పటికీ మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ కుటుంబ సభ్యులు, తన పిల్లలు ఇస్తున్న డబ్బులతో ఇవన్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు రాజకీయాలకు అతీతంగా సేవ చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. సేవ చేస్తే ప్రజలు మర్చిపోరని తప్పకుండా అండదండలు అందిస్తారని మంత్రి అన్నారు. తగిన సమయంలో తగిన విధంగా స్పందిస్తారని మంత్రి అన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ లేదని మంత్రి తెలిపారు. అందుకే తాను నిరంతరం ప్రజా సేవలో ఉంటూనే ప్రజలకు అందుబాటులో ఉంటూనే వారి ఆదరాభిమానాలతో ఎమ్మెల్యేగా గెలుస్తూ ఇవాళ మంత్రిగా ఉన్నానని ఇదంతా ప్రజల ఆశీర్వాదమేనని తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలు తనకి ఎప్పుడు ఉంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాలకు చెందిన డ్రైవింగ్ లైసెన్సులు పొందిన అభ్యర్థులు, సంబంధిత శాఖకు చెందిన అధికారులు, పలువురు ప్రజలు, పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు, ప్రత్యేకించి యువకులు పాల్గొన్నారు.

## బీసీ బంధు చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, పరకాల :** కులవృత్తుల వారు ఆర్థికంగా ఎదగాలని, గౌరవంగా బతకాలని బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేస్తున్న బీసీ బంధు లక్ష రూపాయలు ఒకటో వార్డులోని లబ్ధిదారులు వైనాల సురేష్, పున్నం రవి, ఏలూరి రాజులకు శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేశారు. బీసీ బంధు రావడానికి కృషి చేసిన కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్, పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీనివాస్ కు బీసీ బంధు పొందిన పలువురు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్, కమిషనర్ శేషు ఆంజనేయులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## రాజ్యాధికార సాధనకు రాజకీయ యుద్ధ భేరి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా శాఖలోని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ లో మండల అధ్యక్షుడు గోలి రవి, గ్రామ శాఖ అధ్యక్షుడు ధర్నా మోహన్ దాస్ ఆధ్వర్యంలో చలో కోరుట్ల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద మల్లయ్య ముఖ్య అతిథిగా మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మండల సురేందర్, మాజీ అధ్యక్షుడు దార్న శ్రీనివాస్ విచ్చేసి గోడపత్రికలను ఆవిష్కరించారు. కోరుట్ల పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు 13న బహిరంగ సభ ఉన్నందున తప్పక హాజరు కావాలని కోరారు. పద్మశాలిలందరూ ఏకమై సంఘటితంగా ప్రతి ఒక్కరూ వారి వారి స్థానాల నుంచి స్వతంత్రంగా వాహనాల ఏర్పాటు చేసుకొని పద్మశాలి రాజకీయ యుద్ధభేరి బహిరంగ సభకు హాజరుకావాలన్నారు. చట్టసభలలో మన జనాభా ప్రకారం ప్రతి పార్టీ నుంచి పద్మశాలీలకు అధిక మొత్తంలో ఎమ్మెల్యే సీట్లను, ఎమ్మెల్సీగాని ఎంపీ సీట్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుడిమల కృష్ణారావు, యూత్ కన్వీనర్ బైరి అజయ్, జిల్లా జాయింట్ సెక్రెటరీ వలపదాసు శ్యాంసుందర్, మురళీకృష్ణ, మండల కార్యదర్శి రచ్చ సంపత్, కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడు బైరి భిక్షపతి, ముల్కనూర్ గ్రామ యువజన సంఘం అధ్యక్షుడు రాపల్లి రాజు, చిదురాల ఐలయ్య, దిలీప్, సబ్బని రమేష్, లక్ష్మి నరసింహ స్వామి, వడ్డేపల్లి సురేష్, దార్న గణేష్ పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** వైద్య ఆరోగ్యశాఖలో గత 15 సంవత్సరాలుగా కాంట్రాక్టు ప్రాతిపదికన, చాలీచాలని జీతాలతో, కుటుంబ పోషణ భారమై పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని రాయపర్తి పీహెచ్ సీ పరిధిలోని రెండో ఏఎన్ఎంలు నిరసన చేపట్టారు. కోవిడ్ 19 మహమ్మారి సమయంలో తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రాణాలు పోతున్న లెక్కచేయకుండా ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉండి పనిచేశామని తెలిపారు. వైద్యుల మాదిరిగానే తమకు వెయిటేజీ ఇచ్చి క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వం ఏకపక్షంగా విడుదల చేసిన నోటిఫికేషన్ ఎంపీహెచ్ డబ్ల్యూ 2/23ను రద్దు చేయాలని, ఎటువంటి రాత పరీక్ష లేకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.సునీత, ఓ.కరుణ, కె.కల్పన, పి.రజిత, పి.భాగ్యలక్ష్మి, బి.కవిత, పి.సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ డ్రాపౌట్స్‌కు ఓ వరం

### జిల్లా గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సార్వత్రిక విద్య ఎంతో సులభమైనదని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్ అన్నారు. ఓపెన్ స్కూల్ ప్రాధాన్యతపై అవగాహనలో భాగంగా బాలసముద్రంలోని జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్ రావుతో కలిసి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్ , ఇంటర్ లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్, బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందరికి విద్యను అందించాలనే దృక్పథంతో మధ్యలో చదువు మానివేసిన వారందరు, వారి విద్యార్హతలు పెంపోదించుకొనుటకు, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, వివిధ వృత్తి పనుల వారు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంపిక చేసుకొని ఆదివారాలు, సెలవు దినాలలో ముఖా ముఖి తరగతులకు హాజరై కోర్సు పూర్తి చేయవచ్చని తెలిపారు. అనంతరం ఓపెన్ స్కూల్ వరంగల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ మురాల శంకర్ రావు మాట్లాడుతూ ఓపెన్ టెన్త్, ఇంటర్ లో ప్రవేశాలు పొందగోరే అభ్యర్థులు అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లను సంప్రదించి వారి సూచనల మేరకు ఆన్ లైన్ లో సంబంధిత రుసుము చెల్లించి ప్రవేశాలు పొందాలన్నారు. ప్రవేశాలకు అపరాధ రుసుముతో ఈ నెల 31 చివరి తేది అని, దూర విద్యా విధానంలో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఓపెన్ పదవ తరగతి, ఇంటర్ కోర్సులను, డ్రాపౌట్ విద్యార్థులు అందరు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ వరంగల్ ఉమ్మడి జిల్లా జాయింట్ సెక్రటరీ బిన్ని లక్ష్మణ్, ఈ సి మెంబెర్ కందుల సృజన్ కాంత్, స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భూక్య దశ్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారులకు మహర్ధశ

**రూ.25 కోట్లు మంజూరు**

**సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే చల్లా**



**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గంలో పరకాల నుంచి నార్లాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రధాన రహర్లదారులకు డబుల్ రోడ్లుగా విస్తరణ చేస్తు నిధులు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్ కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల, సీఎం కేసీఆర్, మంత్రుల సహకారంతో మరిన్ని నిధులు మంజూరు చేసి నియోజకర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని, రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కృషిచేస్తున్న సీఎం కేసీఆర్ కు అండగా నిలవాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై, సీఎం కేసీఆర్ పై అసత్యపు ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు.

## జీవితంలో పుస్తక పఠనం భాగం కావాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రతి వ్యక్తి జీవితంలో పుస్తక పఠనం భాగం కావాలని హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాప్టిస్ట్ చర్చ్ కాంప్లెక్స్‌లోని ఏ టు జెడ్ మెడికల్ షాప్ పక్కన నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నవతెలంగాణ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ ముందుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నవ తెలంగాణ బుక్ హౌస్ మేనేజర్ బండారి బాబు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ప్రతి పుస్తకంపై 0నుంచి 20శాతం వరకు రాయితీ ఉంటుందన్నారు. ఈ ప్రదర్శన ఈనెల చివరి వరకు కొనసాగుతుందని, పుస్తకాలు కావలసినవారు సెల్ ఫోన్ నంబర్ 94900 99197 కు ఫోన్ చేసి పుస్తకాలు కొనుగోలు చేయొచ్చని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నవతెలంగాణ పత్రిక జిల్లా మేనేజర్ బోయినపల్లి దేవేందర్ రావు, నవచేతన బుక్ హౌస్ మేనేజర్ నాగరాజు, లెక్చరర్ మురళి, మెడికల్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, నారాయణ, చరణ్, అఖిల్ పాల్గొన్నారు.

## రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, హనుమకొండ పరిధిలో గల రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ హనుమకొండలో 10ఏళ్ల లోపు తెలంగాణ రాష్ట్ర బాల బాలికలకు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశం ఉంది. బ్యాటరీ టెస్టుల ద్వారా ఎత్తు, బరువు, 30మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 6%ఇ%10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్, స్టాండింగ్ వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటి టెస్ట్ అను 9 రకాల పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. అత్యధిక మార్కులు పొందిన వారికి ప్రవేశం కల్పించబడునని హనుమకొండ జిల్లా జిల్లా యువజన మరియు క్రీడల అధికారి గుగులోతు అశోక్ కుమార్ తెలిపారు. సీట్ల లభ్యత అనుగుణంగా ప్రవేశం తీసుకుంటామన్నారు. పై అర్హత కలిగిన బాల బాలికలు ఈ నెల 17, 18 న ఉదయం 8.00 గంటలకు తమ ఒరిజినల్ ధృవపత్రాలతో జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయం, జవహరలాల్ నెహ్రూ స్టేడియం, హనుమకొండలో హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు వి.నరేందర్, జిమ్నాస్టిక్స్ కోచ్ : 9392015280, శ్రీమన్నారాయణ, అథ్లెటిక్స్ కోచ్ :9441086556, విష్ణు వర్ధన్, హ్యాండ్బాల్ కోచ్:7386469301లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# అక్రమంగా తాటి, ఈత చెట్లు తొలగింపు



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులకు జీవనం పోస్తూ రాష్ట్రంలో ఉన్న అన్ని కులవృత్తులకు అండగా నిలుస్తూ ఉంటే దానికి విరుద్ధంగా హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా గౌడ సంఘం సంబంధించిన గౌడ సొసైటీ 10ఎకరాల భూమిలో సుమారు 10000ల తాటి చెట్లు, 3000ల ఈత చెట్లు అక్రమంగా తొలగించారు. పరకాలకు కూతవేటు దూరంలో ఉన్న నాగారం గ్రామంలో ఈ తతంగమంతా నడుస్తూ ఉంటే ఎక్సైజ్ అధికారులకు పలువురు సమాచారం తెలిపిన కూడ మామూళ్ల మత్తులో నిర్లక్ష్యం నీడలో అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పూర్తి వివరాల్లోకి వెళితే.. పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన గీత పారిశ్రామిక సహకార సంఘం పేరుతో పది ఎకరాల భూమి కలదు, అట్టి భూమి కొందరు బడాబాబులు అధిక రేటుకు విక్రయించి అందులో ఉన్న తాడి చెట్లను ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండా దౌర్జన్యంగా జేసీబీలా సహాయంతో తొలగించడం జరుగుతుంది. ఇదేమిటి ఎలాంటి పర్మిషన్ లేకుండా తాడిచెట్లు ఎందుకు పీకుతున్నావని చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక తాటి చెట్టు ఈత చెట్టు తొలగిస్తే 1980 రూపాయలు ప్రభుత్వ రుసుము చెల్లించి తొలగించడానికి ఎక్సైజ్ అధికారులచే అనుమతి తీసుకుని తాటి చెట్టు తొలగించాల్సి ఉండగా అధికార పార్టీ నాయకులమనే అహంకారంతో ఎలాంటి అనుమతులు లేకుండా దౌర్జన్యంగా తాటి వనం తొలగిస్తున్నారని బాధితులు మండిపడ్డారు. ఇలా ఎలాంటి అనుమతులు లేకుండా కులవృత్తులను కనుమరుగు చేస్తున్న వారిపై, ప్రోత్సహిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుసుము చెల్లించే విధంగా చర్యలు తీసుకొని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అప్పుడే కులవృత్తులకు జీవనం పోసిన వారవుతారు. అక్రమ తాటి వనం తొలగింపుపై ఎక్సైజ్ అధికారులను వివరణ కోరగా మాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శుక్రవారం 11, ఆగస్టు 2023
www.warangalvoice.net

# ఘనంగా భారత స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



**వరంగల్ వాయిస్, జనగామ :** ఘనంగా భారత స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, సుహాసిని, డీసీపీ పి.సీతారాం, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రతి శాఖకు సంబంధించిన ప్రగతి నివేదిక, ప్రసంగం కాపీని సిద్ధం చేయాలని, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, రెవెన్యూ శాఖ, మిషన్ భగీరథ గ్రామీణ అభివృద్ధి శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, మత్స్యశాఖ, మున్సిపల్, రెండు పడకల గది, చేనేత శాఖ, టూరిజం, దేవాదాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ, తదితర (25) విభాగాలకు చెందిన స్టాల్స్, ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలకు వచ్చే అతిథులు, ప్రజల సౌకర్యార్థం గ్రౌండ్ లో కుర్చీలు, టెంట్లు, తాగునీరు, తదితర వసతులు కల్పించాలన్నారు. సాంస్కృతి కార్యక్రమాలు, నిర్వహించాలని, సభా ప్రాంగణంలో విద్యుత్తు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి విభాగానికి చెందిన అధికారులు వారికి కేటాయించిన పనులను తనిఖీ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా వేడుకలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా 1.65 లక్షల జాతీయ జెండాలను అన్ని గ్రామ పంచాయతీలకు, ఇంటింటీకి జాతీయ జెండా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ జెండాకు ఎలాంటి ఇబ్బందులు, అవమానాలు రాకుండా ప్రజలకు చైతన్యం కల్పించి జెండాలను ఎగరవేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రామ్మూర్తి, మురళీకృష్ణ, డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంరెడ్డి, జడ్పీ సీఈవో వసంత, ముఖ్య ప్రణాళిక అధికారి ఇస్మాయిల్, డీఏవో వినోద్ కుమార్ , కలెక్టరేట్ పరిపాలన అధికారి పి.రవీందర్, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు సరుకుల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఎస్ ఆర్ నగర్ కాలనీలోని ముంపు ప్రాంత ప్రజలకు అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ స్వయంగా ఇంటింటికి వెళ్లి బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల కష్ట సుఖాలలో పాలుపంచుకుంటూ వారికీ ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవడమే కాకుండా అరూరి ఫౌండేషన్ ద్వారా తక్షణ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, డివిజన్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రేపటి ధర్నాను విజయవంతం చేయండి



**వరంగల్ వాయిస్, పరకాల :** యూఎస్ పీసీ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సమస్యల సాధనకు రేపు జిల్లా కేంద్రాల్లో జరిగే ర్యాలీ, ధర్నాను విజయ వంతం చేయాలని యూఎస్ పీసీ బాధ్యులు మేరుగు ప్రసన్న రాజారాం ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. పరకాల మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ వేయాలని, జులై 1 నుంచి ఐఆర్ మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, కొత్త నియామకాలు చేపట్టాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 317జీఓ బాధితులకు న్యాయం చేయాలని, పండితులు, పీఈటీలకు పదోన్నతులు, ఎయిడెడ్ ఉపాధ్యాయలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, ట్రెజరీలో ఆమోదం పొంది ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్న బల్లులన్నింటిని సత్వరమే చెల్లించాలని మేరుగు ప్రసన్న డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాని యెడల సెప్టెంబర్ 1న ధర్నాచౌక్ వద్ద హైదరాబాద్ ధర్నా నిర్వహించి ప్రభుత్వం మెడలు వంచుతామని, ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురై తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ పీసీ విశ్వనాథం, భిక్షపతి, రాజమౌళి, శశికళాధర్, సారయ్య, రాజయ్య, శ్రీలత, స్వప్న, శ్రీనాథ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో..




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 12న జరిగే జిల్లా కేంద్రాలలో ర్యాలీ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ గోడపత్రికను జడ్పీఎస్ఎస్ శనిగపురం పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. గోడపత్రిక ఆవిష్కరణ సందర్భంగా యూఎస్ పీసీ మహబూబాబాద్ జిల్లా బాధ్యుడు చాగంటి ప్రభాకర్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు శాపంగా మారినా నూతన పెన్షన్ విధానం(సీపీఎస్)ను తక్షణమే రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, జులై 2023 నుంచి ఐఆర్ ప్రకటించి, రెండో పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, టీచర్ల పదోన్నతులు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మరొక యూఎస్ పీసీ జిల్లా బాధ్యులు బలాష్టి రమేష్ మాట్లాడుతూ కేజీబీవీ ఇతర గురుకుల టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని, నగదు రహిత అపరిమిత ఆరోగ్య పథకాన్నిఅమలు చేయాలని, మెడికల్ సరెండర్ వంటి ఆర్థిక బిల్లుల చెల్లింపులో తీవ్ర ఆలస్యాన్ని నివారించాలని, ప్రతి నెల వేతనాలు ఒకటో తేదీనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్ పీసీ జిల్లా బాధ్యుడు చాగంటి ప్రభాకర్, బలాష్టి రమేష్, నాయకులు జలగం వీరస్వామి, అనిత, మంజు భార్గవి, సువర్ణ, శనగపురం ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు ఎండీ రంజాన్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్ లో సమీక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు వివిధ శాఖల ద్వారా పంపిణీ చేసే ఆస్తుల వివరాలు, ఏర్పాటు చేసే స్టాల్స్ వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు. దశాబ్ది ఉత్సవాలు, వరదలలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, అధికారులకు ప్రశంసా పత్రాలు అందించాలని నిర్ణయించామని, ఇందుకు అనుగుణంగా ప్రతి కార్యాలయం నుంచి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వేడుకలకు సంబంధించి ప్రోటోకాల్ పాటిస్తూ సీటింగ్ ఏర్పాటు చేయాలని, స్టేజ్ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను సంబంధిత శాఖ అధికారులు అంబేద్కర్ స్టేడియంలో పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లా ప్రగతి సందేశాన్ని తయారు చేయాలని, స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధకారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో నృత్య ప్రదర్శనలు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేడుకల సందర్భంగా అంబులెన్సులు, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కరుణాకర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి మహేష్, సంబంధిత అధికారులు, తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

# బోనాల వేడుకల్లో వరద రాజేశ్వర్ రావు



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండలంలోని నందనం గ్రామంలో పెద్ద దేవుని పండుగ, బోనాల వేడుకల్లో కాంగ్రెస్ నేత ఎర్రబెల్లి వరదరాజేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్, మండల ఎంపీటీసీ లక్ష్మికుమారస్వామి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకట సాంబయ్య, మండల నాయకుడు జట్టబోయిన రాజు, నాగబెల్లి మహేందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండి సంపత్, గ్రామ యూత్ కార్యదర్శి హరీష్, గ్రామ యూత్ అధ్యక్షుడు మారుబట్ల రాజారామ్, గ్రామ నాయకులు చెవు సమ్మన్న, జట్టబోయిన శ్రీనివాస్, హరీష్, రాజశేఖర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేష్ పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగ బైక్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా తపాలా శాఖ బైక్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఉదయం హర్ తిరంగ్ యాత్ర ప్రచారంలో భాగంగా హనుమకొండ హెడ్ పోస్టాఫీస్ దగ్గర నుంచి తపాలా శాఖ సిబ్బంది అందరూ జాతీయ పతకాలతో నగర ప్రజలలో దేశభక్తిని పెంపొందించడానికి తిరంగ యాత్రను నిర్వహించారు. హనుమకొండ పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ వి.హనుమంతు ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఆయనతో పాటు తపాలా శాఖ సిబ్బంది అందరూ పాల్గొన్నారు. ఈ ర్యాలీ హనుమకొండ హెడ్ పోస్టాఫీస్ దగ్గర నుంచి మొదలై కలెక్టరేట్ వరకు నిర్వహించారు. రూ.25 విలువ చేసే 20 నుంచి 30 అంగుళాలు కలిగిన జాతీయ జెండాను హనుమకొండ పోస్టల్ డివిజన్ పరిధిలోని అన్ని తపాల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. తపాలా కార్యాలయానికి వెళ్లలేని వారు ఆన్ లైన్ ద్వారా కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఎక్కువ మొత్తంలో జాతీయ జెండాలు కావాల్సిన వారు సమీపంలోని తపాలా కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

# ఇంటింటా భారతీయ జెండా




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రంలో తంతి తపాలా ఉద్యోగస్తులు, ఉమ్మడి వరంగల్ జిల్లా సూపర్ డెండెంట్ ఎం నరసింహస్వామి ఆదేశాల మేరకు హర్ గర్ గు తిరంగా విశిష్టతను ప్రజలకు వివరిస్తూ ఆగస్టు 15స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ప్రతి ఇంటింటా ఎగరావేయాలని, జెండా కొనుగోలును వినియోగించుకొవాలన్నారు. ప్రతి జెండా రూ.25 కు అందుబాటులో ఉన్నాయని, పోస్టల్ ద్వారా, ఆన్ లైన్ సౌకర్యం ద్వారా అందించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ పీఎం అనిల్ కుమార్, ఆఫీస్ స్టాఫ్ వడ్లకొండ రాజ్ కుమార్ గౌడ్, మండ రంజిత్, క్రాంతి కిరణ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# డీవార్మింగ్ మాత్రల పంపిణీ

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలో అంగన్వాడీ సెంటర్‌లో జాతీయ నులి పురుగుల నివారణ ఉత్సవాల్లో భాగంగా గురువారం అంగన్వాడీ సెంటర్ లో అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పిల్లలకు డీవార్మింగ్ టాబ్లెట్లను వేయించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా సూపర్ వైజర్ కందుల శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పిల్లలకు టాబ్లెట్లు వేయించాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నారగాని అనిత, సంపూర్ణ కళావతి, వినోద, ఏఎన్ఎం విజయలక్ష్మి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# లైగర్ ఫ్లాప్‌తో నిరాశ చెందా

సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండకు ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. తన ఆటిట్యూడ్‌తో ఇండియా వైడ్ గా పాపులర్ అయ్యాడు. అయితే గతేడాది భారీ అంచనాలతో పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఆయన నటించిన లైగర్ భారీ డిజాస్టర్ గా నిలిచింది. ఈ సినిమా డిజాస్టర్ తో విజయ్ లో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. తన తీరును కూడా పూర్తిగా మార్చుకున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఒప్పుకున్నారు కూడా. తాజాగా 'ఖుషి' మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఎంతో కూల్‌గా, హుందాగా బదులిచ్చారు. ఈ క్రమంలోనే 'లైగర్' ఫ్లాప్ తో పాటు తాను






వ్యవహరించే తీరు గురించి కూడా మాట్లాడారు. 'ఏదైనా సినిమా ఆశించిన విధంగా ఆడకపోతే బాధ పడతాము. లైగర్ కన్నా ముందు ఎన్నో ప్లాన్ హిట్స్ చూశాను. గొప్ప కథలను చెప్పాలనుకుంటున్నాం. ఫలితాలు కొన్నిసార్లు బాధ పెట్టినప్పటికీ నా జర్నీని ఆపలేవు. కిందపడిపోతాననే భయం కూడా లేదు. పడితే బాధపడతాను. కానీ, నిలబడి మళ్లీ పరిగెడతాను' అని విజయ్ పేర్కొన్నారు. అలాగే తాను ఏదైనా చెబితే అది జరుగుతుందని, అందుకే లైగర్ హిట్ అవుతుందని తాను భావించినట్లు చెప్పారు. కానీ 'లైగర్' విషయంలో అది జరగలేదని అన్నారు. దీంతో కాస్త నిరాశ చెందినట్లు తెలిపారు. అందుకే తన తర్వాతి మూడు సినిమాలకు తక్కువగా మాట్లాడాలని అనుకున్నట్టు విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. ' నా తర్వాతి మూడు చిత్రాల కోసం డెసిషన్ తీసుకున్నాను. సినిమా హిట్ అని అనిపించాకే బ్లాక్‌బాస్టర్ అని అంటాను. అప్పటివరకు నేను నా నోటిని మూసుకోవాలని అనుకుంటున్నాను. నా పనే మాట్లాడాలని భావిస్తున్నాను. ఇకపై నోరు మూసుకొని ఉంటాను' అని విజయ్ అన్నారు.

# వాళ్లకు ఓ టైమ్ వస్తుంది

ప్రయత్నిస్తే తెలుగు సినిమాల్లో తెలుగు అమ్మాయిలకు ఛాన్స్‌లు ఎందుకు రావన్న ప్రశ్నకు సమాధానం దొరికింది.'బేబి' బ్యూటీ వైష్ణవి చైతన్య రాకతో ఇప్పుడు తెలుగు అమ్మాయిలకు ఛాన్స్ ఉందన్న సమాధానం వచ్చింది. ఎనిమిదేళ్లు ప్రయత్నించి బేబి సినిమాతో వైష్ణవి నటిగా నిరూపించుకున్న సంగతి తెలిసిందే. ఇదే కోవలో ప్రణవి అనే మరో తెలుగు నటి కూడా తెలుగు వాళ్లకు అవకాశాలు వస్తాయి. అవి ఆలస్యంవొచ్చు అంతే తేడా అంది. ఎంతకాలం అని పరభాష నటులపై ఆధారపడతారు? తెలుగు వాళ్లకు ఓ టైమ్ వస్తుంది. అప్పుడు తప్పక అవకాశాలు వస్తాయని ధీమా వ్యక్తం చేసింది. తాజాగా కావ్య కూడా వైష్ణవి మాటకే ఓటేసింది. ' నటిగా నా ప్రయాణం బాగుంది. 'మసూద'..'బలగం'..ఇప్పుడు 'ఉస్తాద్' ముగ్గురు దర్శకులు తమ పాత్రలకి తెలుగు అమ్మాయి కావాలనుకున్నారు. అలా నాకు ఈ అవకాశాలు వచ్చాయి. ఆ కోణంలో తెలుగు అమ్మాయి అవ్వడం అదృష్టంగా భావిస్తున్నా. భాష వస్తేనే ఛాన్స్ వస్తుందని కాదు. నటన చాలా ముఖ్యం. శ్రీదేవి..సావిత్రి గొప్ప అవకాశాలు అందుకున్నారు. దర్శకులకు ఫలానా పాత్రకు తెలుగు అమ్మాయి సూటవుతుందంటే తప్పకుండా వాళ్లనే పెట్టుకుంటారు. ఇక్కడ వాళ్ల ఛాయిస్ అనేది ముఖ్యం. ఆ రకంగా మనం సన్నదం కావడం అన్నది అతి ముఖ్యమైన అంశం' అని అంది.



# ఆధిపత్యం కోసం పోరాటం

## కింగ్ ఆఫ్ కోత లో దుల్కర్ సల్మాన్




పాన్ ఇండియా స్థాయి ఇమేజ్ ఉన్న మలయాళ స్టార్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు దుల్కర్ సల్మాన్ . మూవీ లవర్స్‌తోపాటు అభిమానులను ఎంటర్‌టైన్ చేయడమే లక్ష్యంగా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నాడు. ఈ టాలెంటెడ్ యాక్టర్ ప్రస్తుతం కింగ్ ఆఫ్ కోతలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ అభిలాష్ జోషి డైరెక్షన్‌లో గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో వస్తోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ఫస్ట్ సింగిల్, టీజర్‌లు ప్రేక్షకులను అలరించాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. చిన్నప్పుడు రాజు కు ఒక్కటే కల ఉండేది. అతడి తండ్రి లాగానే అతడు కూడా పెద్ద గ్యాంగ్‌స్టర్ అవ్వాలనుకుంటాడు. రాజు ఒకప్పుడు కోత కి మహారాజు అనే సంభాషణలతో ట్రైలర్ మొదలు అవుతుంది. ఇక ట్రైలర్ గమనిస్తే కోత అనే ప్రాంతంపై ఆధిపత్యం కోసం పోరాడే రాజు పాత్రలో దుల్కర్ సల్మాన్ కనిపించబోతున్నాడు. కాగా దుల్కర్ క్యారెక్టరైజేషన్ గురించి చెప్తున్న డైలాగ్స్‌తో సాగుతున్న ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచుతోంది. ఈ చిత్రాన్ని వేఫరెర్ ఫిలిమ్స్-జీ స్టూడియోస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఈ మూవీకి షాన్ రెహ్మాన్, జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. కింగ్ ఆఫ్ కోటలో ప్రసన్న, ఐశ్వర్య లక్ష్మి, నైలా ఉషా, చెంబన్ వినోద్, గోకుల్ సురేశ్, షమ్మి తిలకన్, శాంతి కృష్ణ, వడా చెన్నై శరన్, అనిఖా సురేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# పవన్ బర్త్‌డే కానుక

## 2న ఓజి టీజర్ రిలీజ్‌కు ప్లాన్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఎన్ని సినిమాలు చేస్తున్నా.. అందరి కళ్లు ఓజి పైనే ఉన్నాయంటే అస్సలు ఆశ్చర్యపోవాల్సిన అవసరమే లేదు. ఎందుకంటే.. ఈ సినిమా మొదలైనప్పటి నుంచి పాజిటివ్ వైబ్స్ అలా ఉన్నాయి మరి. ఆస్కార్ విజేత అయిన 'ఆర్ఆర్ఆర్'చిత్రాన్ని నిర్మించిన డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మాణంలో ఈ భారీ యాక్షన్ డ్రామా తెరకెక్కుతోంది. 'సాహో' దర్శకుడు, పవర్‌స్టార్ వీరాభిమాని అయిన సుజీత్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తున్నారు. అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్ కీలక పాత్రలు పోషిస్తుండగా, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హాష్మీ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా 50 శాతానికి పైగా చిత్రీకరణను పూర్తి చేసుకున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన 'ఫైర్ స్టోర్మ్ అప్‌డేట్‌ని మేకర్స్ ప్రకటించారు.' హీట్ వేవ్ వస్తోంది.. ఫేస్ చేయడానికి సిద్ధం కండి.. సెప్టెంబర్ 2న రాబోతోంది..' అంటూ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ట్విట్టర్ వేదికగా.. పవర్ స్టార్ పుట్టినరోజు ఫ్యాన్స్ ట్రీట్ ఇవ్వబోతున్నట్లుగా వెల్లడించింది. సినిమా విజువల్స్ మరియు పవన్ కళ్యాణ్ స్క్రీన్ ప్రెజెన్స్ చూసి ఫిదా అయ్యాయని, ఇది నిజమైన 'అగ్ని తుఫాను' అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్, ప్రియాంక మోహన్ జోడిని తెరపై చూడాలని సినీ ప్రియులు కూడా ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు.



# రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

## వరదపై ప్రతిపక్ష పార్టీలది బురద రాజకీయం
## రాజకీయ ఉనికి కోసం ప్రతి పక్షాల ఆరాటం
## ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎంతో మేలు చేస్తూ ప్రభుత్వ పథకాలని అమలు చేస్తోన్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని కొనియాడారు. ఉచితంగా 24గంటల విద్యుత్, రైతు వేదికల నిర్మాణం, ఎరువుల కొరత లేకుండా, సకాలంలో విత్తనాలు అందిచడం, వరి, మక్కలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది తమ ప్రభుత్వమని గుర్తు చేశారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ విడతల వారీగా చేయడం చాలా గొప్ప విషయం అని అన్నారు. సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీ నిర్ణయం వలన జిల్లాలో దాదాపు 60,601 మంది రైతులకు రూ.360.28 కోట్ల లబ్ది చేకూరుతుందని తెలిపారు. పరిస్థితులు మెరుగైన తరుణంలోనే అకాల వర్షాలతో నియోజకవర్గంలో ఎంతో నష్టం వచ్చింది. అకాల వర్షాలతో దెబ్బతిన్న చెరువులు, రోడ్లు, విద్యుత్తు, గ్రామాల నష్టాలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నియోజవర్గంలో మొదటి ప్రాధాన్యతగా రోడ్లు, చెరువుల పునరుద్ధరణకు రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖ ద్వారా హుజురాబాద్ -భూపాలపల్లి నియోజకవర్గ వర్గాలను అనుసంధానంగా ఉన్న రోడ్డు రెండు దారులు చేయాలని ముఖ్యమంత్రిని కోరగా రూ.14 కోట్లు మంజూరు చేశారని అన్నారు. రోడ్లు అభివృద్ధి అనంతరం నియోజకవర్గ పరిధిలోని నవాబుపేట, జడలపేట, జగ్గయ్యపేట, సుల్తాన్ పూర్ గ్రామాలలో సైడ్ డ్రైన్ ల నిర్మాణం కోసం రూ.2కోట్ల నిధులు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని 4(కనపర్తి, కాశింపల్లి,మెట్ పల్లి, అప్పయ్యపల్లి) నూతన చెక్ డ్యామ్ ల నిర్మాణానికి 20కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. జిల్లాలో నిర్మాణమవుతున్న మెడికల్ కాలేజ్ కి అదనంగా రూ.110కోట్లతో అదనపు గదులు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు, మంత్రి హరీష్ రావుకు గండ్ర ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే జిల్లా ప్రభుత్వ దవాఖాన అందుబాటులో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని, ప్రజలందరూ ప్రభుత్వ దవాఖాన సేవలు విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో నూతనంగా బీసీ మహిళ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వ ఆమోదం తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న మోరంచపల్లి, ఇతర గ్రామాలకు ప్రభుత్వ పరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వెంకిర్యాల పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ వితరణ




**వరంగల్ వాయిస్, జనగామ :** ప్రాథమిక పాఠశాల వెంకిర్యాలలో శుక్రవారం దూడల రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యా కమిటీ చైర్మన్ తాళ్లపల్లి అశోక్ గౌడ్ పాల్గొన్నారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని ఉద్దేశంతో వైటెక్ సిస్టం ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ లో పనిచేస్తున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగులు గత 13సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం సేవ చేస్తున్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఈ సంవత్సరంరూ.80,000 విలువగల 500లీటర్ల వాటర్ ప్యూరిఫైయర్ ను ప్రాథమిక పాఠశాల వెంకిర్యాలకు వితరణ చేశారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం ప్రతి సంవత్సరం అందించడం కోసం సిద్ధంగా ఉన్నామని సంస్థ ప్రతినిధి జొన్నల శ్రీనివాస్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ సర్వీస్ డైరెక్టర్ సంజీవయ్య విభూతి, అసోసియేట్ డైరెక్టర్ మునిరత్నం, గంగాధర్ ,అశ్విన్ ,మనీష్ ప్రేరణ ,శివ, చైతన్య, రశ్మి ,ప్రసాద్ రెడ్డి, ప్రమోద్, స్పందన, వినోద్, ప్రీతి పాఠశాల ఉపాధ్యాయులు లలిత, విద్యారాణి, స్రవంతి, జగదాంబ, ఆయాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గట్టమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్ ములుగు జిల్లాలోని గట్టమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పల్లె రవి గౌడ్, బొనగాని యాదగిరి గౌడ్ లను ఘనంగా సన్మానించారు. తర్వాత ములుగు జిల్లాలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్రను పల్లె రవికుమార్ గౌడ్ , తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ ప్రారంభించారు. ములుగు జిల్లాలో ప్రమాదవశాత్తు మరణించిన, గాయాలు అయిన గీత కార్మికులకు తక్షణ ఆర్థిక సహాయంగా రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ ద్వారా చెక్కులను అందిజేశారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింత రమేష్ గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎన్.మోహన్ గౌడ్, గోపా గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జనగాం శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు పులిమోహన్ గౌడ్, జై గౌడ్ ఉద్యమం జిల్లా అధ్యక్షులు మార్క రవి గౌడ్, ఆరెల్లి రాధాకృష్ణ గౌడ్, మొండయ్యా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కేజీకేఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, శివ శంకర్ గౌడ్, గౌడ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అరూరిని కలిసిన రేషన్ డీలర్లు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** రేషన్ డీలర్ల కమిషన్ పెంచుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల వర్దన్నపేట నియోజకవర్గ రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వర్దన్నపేట, పర్వతగిరి మండలాల రేషన్ డీలర్లు బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్దన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ని హన్మకొండ ప్రశాంత్ నగర్ లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ డీలర్ల కమీషన్‌ను క్వింటాకు 70 రూపాయల నుంచి 140 రూపాయలకు పెంచడం హర్షణీయమని తెలిపారు. అలాగే డీలర్లకు 5 లక్షల బీమా, ప్రమాదవశాత్తు చనిపోతే 10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు తెలిపారు. వర్దన్నపేట నియోజకవర్గ రేషన్ డీలర్ల పక్షాన సీఎం కేసీఆర్ కు ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రాజకీయ రిటైర్ మెంట్ తీసుకుంటా..

## మిగులు అభివృద్ధి చేసిపోతా..
## చివరి చాన్స్ ఇవ్వండి...
## డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రజల ఆశీస్సులతో గడిచిన 35ఏళ్లుగా ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి సేవలు అందించుకుంటూ వస్తున్నానని, చివరిసారిగా ఈ దరిమిలా ఎమ్మెల్యేగా తిరిగి గెలిపిస్తే మిగులు అభివృద్ధి చేసి రాజకీయ రిటైర్ మెంట్ తీసుకుంటానని ఎమ్మెల్యే రెడ్యానాయక్ ప్రకటించారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా శుక్రవారం సీరోల్ మండలంలోని చిల్కోయలపాడు, మన్నెగూడెం,అందనాలపాడు, మోదుగడ్డ తండా గ్రామపంచాయతీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రూ.1 కోటి విలువ చేసే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. సంక్షేమ పథకాలను అందించాలని తలంపుతో మే 10న నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇటీవల కేసీఆర్ తో కలిసి నియోజవర్గ సమస్య వివరించగా స్పందించి ఆయన అభివృద్ధి పనులకు మరో 200 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో రూ.10కోట్లతో సీసీ రోడ్లు, ఉమ్మడి కురవి మండల అభివృద్ధికి రూ.5కోట్లు, కురవి గ్రామం నుంచి మొగిలిచర్ల గ్రామం వరకు డబల్ రోడ్డు కోసం రూ.10 కోట్లు, కురవి నుండి రాంపురం గ్రామానికి రూ.4 కోట్లు కేటాయించారన్నారు. ఉల్లేపల్లి మన్నెగూడం గ్రామ సమీపంలోని ఆకేరు వాగుపై రూ.15కోట్లతో నూతన బ్రిడ్జి, నియోజవర్గంలోని ఆయా గ్రామాల్లో లింకు రోడ్లకు రూ.30 కోట్లు, నియోజవర్గంలోని మూడు మండలాలలోని తండా, దళితవాడలో 2500 డబుల్ బెడ్ రూమ్ నిర్మాణానికి రూ.75కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. మరిపెడలో 100 వద్ద పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.50 కోట్లు, నర్సింహులపేటలో సీహెచ్ ఆసుపత్రి, డోర్నకల్ లో జూనియర్ కాలేజ్ నిర్మాణానికి అనుమతులు లభించాయన్నారు. మోదుగడ్డతండా నుంచి ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం గ్రామం వరకు ఆకేరుపై నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 కోట్లు నిధులు కేటాయించేందుకు సీఎం కేసీఆర్ అనుకూలత తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలు నాయక్, జడ్పీటీసీ కమల రామనాథం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నున్న రమణ, రైతు సంఘం మహిళ అధ్యక్షురాలు హైమావతి, మానుకోట మార్కెట్ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ వాంగుడోత్ వీరన్న, సొసైటీ అధ్యక్షుడు భిక్షం రెడ్డి, సత్తిరెడ్డి, పెద్ది వెంకన్న, భోజ్య నాయక్, రమేష్, మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ విజయపాల్ రెడ్డి, నీలా, నంద్యాల నాగమణి మధు, సర్పంచులు ఆంగోతు మోహన్, జువ్వాజీ రాంప్రసాద్, సామినేని సతీష్, చాగర్లమూడి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు హరిష్ నాయక్, లచ్చు నాయక్, ఊడుగుల వీరన్న, బొయినపల్లి రంజిత్, సందీప్, వెంకన్న, గజ్జి మల్లేషం, మేకల రాము, మాన్య పాల్గొన్నారు.

# దివ్యాంగులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన వికలాంగులు శుక్రవారం శివనగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ను నుమర్యాదపూర్వకంగా కలిసి డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో వారికి ప్రాధాన్యత కల్పించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో వికలాంగులు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని అన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో తప్పకుండా వికలాంగులకు ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

# వరంగల్ ఎంపీ స్థానానికి స్థానిక దళితులకే ప్రాధాన్యతనివ్వాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎలక్షన్స్ వచ్చిన ప్రతిసారీ పార్టీలో ఉన్న నాయకులను మరిచి బయట నుంచి వచ్చే వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. బయట నుంచి వచ్చినవారు పోటీ చేస్తూ, ఓడిపోయిన తర్వాత కనుమరుగవుతున్నారు. దయచేసి ఇప్పటికైనా పార్టీని నమ్ముకుని కట్టుబడి ఉన్న కార్యకర్తలను గుర్తించి స్థానిక నాయకులకు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులుగా గుర్తించాలని, స్థానికులైన వారికి టికెట్ కేటాయించాలని జాతీయ ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఎన్నికల సహ ఇంచార్జి సునీల్ బన్సల్ ను హనుమకొండ పార్టీ ఆఫీసులో కలసి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఓబీసీ జాతీయ మెంబర్, ఎక్స్ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎస్సీ మోర్చా నాయకులు, జిల్లా అధికార ప్రతినిధి పోలేపాక మార్టిన్ లూథర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదాసు రాజు కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com